క్లుప్తంగా

తిరుపతి దేవాంగ అన్నదాన సత్రం బోర్డు మెంబర్‌గా అల్లక



మంగళగిరి: తిరుపతి దేవాంగ నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్ బోర్డు సభ్యుడుగా ఎన్నికైన అల్లక ఓంనమశ్శివాయను దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గురువారం పట్టణంలోని దేవాంగ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అల్లక తాతారావు, మొతిక వీరవెంకటసత్యనారాయణ, కొసనం కోట నాగశ్యామలరావు, బొమ్మన శ్యాంకుమార్, కొండక వెంకటేశ్వరరావు, కటకం సత్యనారాయణ, బొమ్మన రవికుమార్, మాన్యం రాము పాల్గొన్నారు.

మంగళగిరి రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



మంగళగిరి: మంగళగిరి రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ హైదరాబాద్ ప్రతినిధి కందిమళ్ల స్వప్న కొనియాడారు. పట్టణంలోని రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, అందే మురళీ మోహనరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి, వడ్లమూడి శ్రీనివాసరావు, కాపరౌతు సుందరయ్య, నూతలపాటి వెంకటేశ్వరరావు, పారేపల్లి నిరంజన్, రావెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఫిరంగిపురం: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30కు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. సమావేశానికి ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. మండలంలోని నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష, ఎంపీపీ అనుమతించిన ఇతర అంశాలపై సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో తెనాలి క్రీడాకారుల ఘనత

తెనాలి: విజయవాడలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇటీవల జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల అండర్–17, అండర్–19 పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెనాలిలోని క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాకు చెందిన క్రీడాకారులు పతకాలను కైవసం చేసుకున్నారు. ఏరీనా నిర్వాహకురాలు, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ జి.సాయిరేవతి గురువారం వారిని అభినందించారు. అండర్–17లో 76 కిలోల విభాగంలో బొల్లు లిఖ్య 227.5 కిలోలల బరువులనెత్తి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. 84 కిలోల విభాగంలో ఏటూరి లక్ష్మి వినయశ్రీ 307.5 కిలోల బరువులనెత్తి బంగారు పతకం సాధించినట్టు తెలిపారు. ఈ విభాగంలో అందరికన్నా అధిక బరువులనెత్తి 48 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ స్ట్రాంగ్ విమెన్ టైటిల్‌ను కైవసం చేసుకోవటం విశేషమన్నారు. అండర్–19 బాలుర విభాగంలో 74 కిలోల్లో తమినేని మణిచంద్ 345 కిలోల బరువులనెత్తి రజత పతకాన్ని అందుకున్నారు. క్రీడాకారులను జిమ్ యాజమాన్యం కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్‌లు పూసపాటి శివరామ కిరణ్‌రాజు అభినందించారు.

విదేశాల్లో ఉద్యోగం పేరిట మోసం

తెనాలిరూరల్: విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని యువకుడిని మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలనుకొండకు చెందిన హిరోషిత్ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాడు. ఇతని అక్కను బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి గతంలో వివాహం చేశారు. 2023లో తిరిగి ఇచ్చిన ఇతనికి చెరుకుపల్లికి చెందిన రమేష్‌రెడ్డి, రవిచంద్రలు పరిచయమై విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ. ఆరు లక్షలకు బేరం కుదుర్చుకుని, రూ. లక్ష అడ్వాన్సు కింద తెనాలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద తీసుకున్నారు. మిగిలిన మొత్తానికి చెక్కులు రాయించుకుని వారి వద్దే ఉంచుకున్నారు. ఏడాది దాటినా ఉద్యోగం ఊసే లేకపోవడంతో టూ టౌన్ పోలీసులను ఆశ్రయించగా గురువారం కేసు నమోదు చేసినట్టు సీఐ రాములు నాయక్ తెలిపారు.

విద్యుత్ బిల్లులు దహనం

తెనాలిఅర్బన్: పెంచిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని సీపీఎం నాయకులు కె.బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లుల పెంపును నిరసిస్తూ 24వ వార్డు శాంతినగర్‌లో గురువారం సాయంత్రం బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. హామీని విస్మరించి బిల్లులను పెంచినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్ పాల్గొన్నారు.

పన్నుల వసూలులో లక్ష్యం చేరేనా!

- డిసెంబర్ ముగుస్తున్నా యాభై శాతం చేరని వైనం
- పన్నుల డిమాండ్ రూ.43.27 కోట్లు
- ఇప్పటి వరకు వసూలు రూ.21.50 కోట్లు
- 30 లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు



మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఈ సంవత్సరం పన్నుల వసూలు లక్ష్యంపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. డిసెంబర్ చివర నాటికి మూడో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండగా యాభై శాతం పన్నులు వసూలు కాలేదు. పన్నులు వసూలు కోసం ఎన్ని ప్రత్యేక చర్యలు తీసుకున్నా పన్నులు చెల్లించేందుకు గృహ, వాణిజ్య యజమానులు ముందుకు రాకపోవడం వలనే ఈ పరిస్థితి నెలకొంది.

నెలఖారులోగా చెల్లిస్తే వడ్డీ రాయితీ..

డిసెంబర్ నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉంటుందని అధికారులు నగరంలో మైకులు పెట్టి ప్రచారం చేస్తున్నారు. పన్నుల వసూలెకు గ్రామ సచివాలయ సిబ్బందిని వినియోగించి ప్రతి రోజు బకాయిదారులకు ఫోన్‌లు చేయించి పన్నులు బకాయిలు గుర్తు చేసి వెంటనే చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని ప్రచారం చేస్తున్నారు. నగరంలో 3 లక్షల మంది జనాభా ఉండగా మొత్తం 50 వార్డులున్నాయి. 40 గ్రామ సచివాలున్నాయి. సచివాలయా వారీగా పన్నుల లక్ష్యాన్ని విధించి సచివాలయ సిబ్బందిని వినియోగించి పన్నులు వసూలు చేస్తున్నారు.

అధికారులు ఎత్తచెప్పినా..

అధికారులు ప్రతి వారం పన్నుల వసూలుపై సమీక్షలు నిర్వహించి వసూలును వేగవంతం చేయడంతో గత కొద్ది రోజులుగా వసూలు పెరుగుతున్నాయి. నగర పాలక సంస్థ అభివృద్ధికి ఆర్థిక పరిపుష్టి అవసరం.. నగర పాలక సంస్థలో పన్నులు వసూలు చేసేందుకు రెవెన్యూ విభాగం ఎంతో కీలకం. ఈ విభాగం వార్డు సచివాలయ సిబ్బందిపై అజామాయిషీ చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో పన్నుల వసూలులో అలసత్వం నెలకొంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే తొమ్మిదో నెల ముగుస్తుంది. అయినా ఇప్పటి వరకు ఆస్తి పన్నులు వసూలులో 45 శాతం, ఇతర పన్నులలో కేవలం 25 శాతంలోపే వసూలైంది. పన్నుల వసూలులో కార్పొరేషన్ పరిధిలో టీమ్‌ల వారీగా ప్రచార వాహనాలు ఏర్పాటు చేశారు.

పాత బకాయిలు ఇలా..

పాత బకాయిలు వన్‌టైమ్ సెటిల్మెంట్ చేసుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చని చెబుతున్నారు. వన్‌టైమ్ సెటిల్మెంట్ రాయితీ ఇస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఏప్రిల్ నెలలో చెల్లిస్తే 5 శాతం మేరకు పన్ను రాయితీ ఇస్తున్నారు. అయినా పన్ను చెల్లింపుదారుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. 2023–24 సంవత్సారానికి మొత్తం పన్నలు రూ.43.27 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ 21.50 కోట్లు వసూలు కాగా రూ 21.77 కోట్లు వసూలు కావాల్సి వుంది.

వసూలుపై ప్రత్యేక దృష్టి



పన్నులు వసూలుపై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగింది. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అధికారులు, సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా నియమించి వసూలు చేస్తున్నాం. మైకులు పెట్టి ప్రచారం నిర్వహిస్తున్నాం.

– అలీంబాషా, కమిషనర్, ఎంటీఎంసీ

మొదలైన చంద్రబాబు బాదుడు

- పేద ప్రజల నడ్డి విరిచే విధంగా విద్యుత్ చార్జీలు
- ఆరు నెలల్లోనే కరెంటు చార్జీలు పెంపు
- అమలుకాని సూపర్ సిక్స్
- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన దొంతిరెడ్డి వేమారెడ్డి



తాడేపల్లిరూరల్: విద్యుత్ చార్జీల బాదుడు సీఎం చంద్రబాబు నాయుడు మొదలు పెట్టారని, ప్రజలకు ఇచ్చిన నిలబెట్టుకోలేకపోయారని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆరోపించారు. విద్యుత్ బాదుడుపై నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే పాత చంద్రబాబు నాయుడుని చూస్తారంటూ అధికారుల సమావేశాల్లో మాట్లాడుతున్నట్లు వివరించారు. ఎన్నికలముందు మారిన చంద్రబాబు నాయుడుని ప్రజలందరూ చూడబోతున్నారని, ప్రజల భవిష్యత్ కోసం సూపర్‌సిక్స్ అమలు చేయడంతో పాటు విద్యుత్ చార్జీలు పెంచనని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మాట తప్పి ప్రజలపై విద్యుత్ చార్జీల భారంపై మోపేందుకు చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమ సారథిగా పేరు తెచ్చుకున్నారని, బాబు కూటమి పాలనలో ప్రజలను వంచించి వారి రక్తమాంసాలను పిండే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని, దానికి ఉదాహరణ ఆరు నెలల కాలంలో విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజల నెత్తిన భారం వేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు గురించి ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన బీజేపీ, జనసేన, చంద్రబాబు నాయుడుతో కలసి ఊరూరా తిరిగి బాదుడే బాదుడు అంటూ దుష్ప్రచారం చేశారని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే సంపద సృష్టిస్తారని చెప్పి ఇప్పుడు ఆయన ప్రజల నుంచి సంపదను ఎలా లాక్కోవాలో అనే ఆలోచనతో పరిపాలన కొనసాగిస్తున్నారని, ఉప ముఖ్యమంత్రి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించే విధంగా ముఖ్యమంత్రితో ఆయన చర్చలు నిర్వహించాలని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెరిగిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ పోరుబాట నిర్వహిస్తున్నారని, నేడు మంగళగిరిలో కొప్పురావు కాలనీలో విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమానికి ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నిరసనను జయప్రదం చేయండి

ఫిరంగిపురం: రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా తాడికొండ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం వైఎస్సార్ సీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి అందరూ తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి గురువారం తెలిపారు. నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు నాయకత్వంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ బాదుడుపై వైఎస్సార్ సీపీ నేడు పోరుబాట

తాడికొండ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు



తాడికొండ: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తాడికొండ అడ్డరోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) పిలుపునిచ్చారు. గుంటూరులోని తాడికొండ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు ఎన్నికల అనంతరం విచ్చలవిడిగా బాదుడే బాదుడు మొదలుపెట్టి విపరీతంగా చార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలపై గత నెల రూ.6,072 కోట్లు, ఈ నెల రూ.9,413 ఓట్లు మొత్తం కలిపి రూ.15,484 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని మండిపడ్డారు. అడ్డగోలు చార్జీల పెంపును నిరసిస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నేడు పోరుబాట కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలపై ప్రభుత్వం అదనంగా మోపి ముక్కు పిండి వసూలు చేస్తున్న విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ తాడికొండ అడ్డరోడ్డులో సబ్ స్టేషన్ వద్ద ఉదయం 10 గంటలకు చేయనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రజలకు అండగా నిలబడి సమస్యలపై పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇకపై ప్రభుత్వ మోసాలను విస్మరించిన ఎన్నికల హామీలను నెరవేర్చే వరకు అలుపెరగని పోరాటం చేస్తామన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు



రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వంగవీటి రాధా తదితరులు

తాడేపల్లిరూరల్: బడుగు బలహీన వర్గాల జ్యోతి, పేదలకు అండగా నిలిచి, వారి అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో పలుచోట్ల దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, కుంచనపల్లి పార్టీ అధ్యక్షులు మిరియాల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలుచోట్ల వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పేదలకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూరపాటి సాంబిరెడ్డి, చాగంటి వెంకటరెడ్డి, బిరుదుగడ్డ విజయేంద్రరావు, అడ్వకేట్ బాజి, గడ్డం తాతయ్య, నల్లపు రాంబాబు, కొమ్మిశెట్టి శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి

మంగళగిరి: వంగవీటి రంగా వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ఉన్న రంగా విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. రంగిశెట్టి బాబి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వంగవీటి రాధ పాల్గొని రంగా విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో దుర్గారావు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దివంగత వంగవీటి మోహనరంగా వర్ధంతి గురువారం ఉండవల్లి సెంటర్‌లో జనసేన నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్, రాధా రంగ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ రాజధాని ముఖ ద్వారం అయిన ఉండవల్లి సెంటర్‌లో వంగవీటి విగ్రహం లేకపోవడం బాధాకరమని, 10 సంవత్సరాల క్రితం రోడ్ల విస్తరణలో భాగంగా విగ్రహాన్ని తొలగించారని, త్వరలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉండవల్లి రాధ రంగా మిత్రమండలి నాయకులు గాదె పోతురాజు, ఉప్పు హరిబాబు, ఏపూరి ఆదియ్య పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా వర్ధంతి కార్యక్రమం

తాడేపల్లిరూరల్: పేదల పెన్నిది, దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాన్ని తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్ వద్ద మహానాడు, సుందరయ్య నగర్ రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రంగా తనయుడు వంగవీటి రాధా తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జంగాల సాంబశివరావు, పల్లెపు భాస్కర రావు, తిరుమలశెట్టి సురేంద్ర, జంగాల వెంకటేష్, సుందరయ్య నగర్,మహానాడు రాధా రంగ మిత్ర మండలి సభ్యులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

తాడికొండలో..

తాడికొండ: వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ శివారు బడేపురంలో జనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు బండ్ల కోటేశ్వరరావు, తాయి కాంతి కిరణ్, కాలిశెట్టి రాజీవ్, మొగిలి అశోక్, కాలిశెట్టి భాస్కర్, కాలిశెట్టి మోహన్ రావు, మన్నె రమేష్, రెడ్డి వెంకట్రావు, కొణతాల ఏసుబాబు, పాలడుగు సుబ్బారావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంటీఎంసీలో కమాండ్ కంట్రోల్ రూమ్

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అలీంబాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7093912653,08645 295192 నంబర్‌లకు ఫోన్ చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకుని ఉండవల్లిలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ వర కుమారరావు మాట్లాడుతూ కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీని పురస్కరించుకుని ఖాతాదారులకు, ప్రజలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనాథ్, ఎస్‌కే సులేమాన్, పీవీఎల్ సరోజ, నాగార్జున, లక్ష్మీ ఫౌండేషన్ డాక్టర్లు రహీం, భవాని, నజియా తదితరులు పాల్గొన్నారు.

పేరేచర్లలో...

మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలోని ఇంటెల్ హైస్కూల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక మేడికొండూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాములపాటి శివన్నారాయణ, గ్రామ సర్పంచి దేవరకొండ రాజ్‌కుమార్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పేరేచర్ల, పరిసర గ్రామాలకు చెందిన 250 మంది వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

శిబిరంలో ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఐ.మారుతి ప్రసాద్, డాక్టర్ జి. దీప్తి, డాక్టర్ సాయి తేజ, డాక్టర్ గాయత్రి, ల్యాబ్ టెక్నీషియన్స్ జి.నాగేంద్రబాబు, అశ్విన్ పాల్గొని వైద్య సేవలు అందించారు. కొన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. శుక్రవారం రెండో రోజు కూడా శిబిరం కొనసాగుతుందని వెల్లడించారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఇంటెల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ తెలిపారు.

ఘనంగా సీపీఐ జయంత్యుత్సవం



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్‌ప్రాంతాల్లో సీపీఐ శత వసంత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు చోట్ల పార్టీ జెండాలను ఆవిష్కరించారు. తాడేపల్లి సీపీఐ కార్యాలయం ఎదుట జెండాను సీనియర్ నాయకుగు మానికొండ డాంగే ఆవిష్కరించగా, పార్టీ కార్యాలయంపై గుంటక సాంబిరెడ్డి ఆవిష్కరించారు. గేటు సెంటర్‌లో సీపీఐ స్థూపం వద్ద పార్టీ జెండాను ఆ ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య ఆవిష్కరించగా, నెహ్రూ బొమ్మ సెంటర్‌లో కంచర్ల కాశయ్య ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు మునగాల రామారావు, జి.శివ, శీలం శ్యామ్, బాషా, ఖాసిం, శ్రీహరి, ప్రసాద్, వలి, చిన్నా, దానియేలు, రాజు, హనోక్, క్రాంతి కుమార్, ప్రశాంత్, ప్రేమ్ పాల్గొన్నారు.

కంతేరులో..

తాడికొండ: మండల పరిధిలోని కంతేరులో సీపీఐ శత వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి గుర్రంకొండ సత్యానందం జెండా ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు, కార్మిక, కర్షక, రైతు వర్గాల కోసం సీపీఐ చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుర్రంకొండ స్వామియేలు, రాము, వరగాని బ్రహ్మయ్య, మల్లవరపు స్వామియేలు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు స్టీవెన్

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని పోరాట కమిటీ నాయకుడు కూరపాటి స్టీవెన్ అన్నారు. గురువారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల మంత్రి నారా లోకేష్, ప్రజాదర్బార్‌కు కార్మికులను పిలించుకొని, కార్మికుల సమస్యను నాయకులు వివరిస్తున్నా లోకేష్ వినకుండా కార్మికులపై అసహనం వ్యక్తం చేయడం వారిని నిరాశ పరిచిందని అన్నారు. ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకోకపోతే మా సమస్య ఎలా పరిష్కారమౌతుందని, ఎవరు మా సమస్యను పరిష్కరిస్తారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మంత్రి నారా లోకేష్ చొరవ చూపించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె. కోటయ్య, కె.ఆదినారాయణ, ఇస్రాయిల్, రమాదేవి, దుర్గ భవాని, ఇమాంబీ, దానయ్య పాల్గొన్నారు.

• గోవింద నామ సంకీర్తనకు..



పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన బృందం, సాయిరాం సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 108 మంది చిన్నారులు, 200 గాయకులు తిరుమలకు బయలుదేరి వెళ్లారు. 27వ తేదీన ఉదయం 10–11 గంటల వరకు గోవిందనామ సంకీర్తన, అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుమల ఆస్థాన మండపంలో 300 మందితో అన్నమయ్య సంకీర్తనల గానాలాపన ఉంటుందని తెలిపారు. పిల్లలు, పెద్దల్లో భక్తి భావన పెరగటానికి మరియు అన్నమయ్య సంకీర్తన, గోవింద నామ ప్రచార నిమిత్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కొండపి శ్రీనివాసరావు, వరుఖుల లక్ష్మి సునీత తెలిపారు. ఈ యాత్రలో సునీల్ కుమార్, పద్మజ టీచర్, డాక్టర్ వరుఖుల రవిశంకర్, కోలాటం మాస్టర్ ప్రసాద్, నందిని, సీమ, ప్రసన్న, శైలజ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

–తెనాలి

మొక్కజొన్న పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ వాసంతి

ఫిరంగిపురం: మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. మొక్కజొన్న దిగుబడిపై కత్తెర పేరుతో 'సాక్షి' కథనంపై అధికారులు స్పందించారు. మండలంలోని సుదురుపాడులోని మొక్కజొన్న పొలాలను వ్యవసాయశాఖ మండల అధికారి వాసంతి, రైతులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకు పది కిలోల తవుడు, ఒక కిలో బెల్లం, అర లీటర్ రీమాన్ మందు కలిపి చిన్నపాటి ఉండలుగా తయారు చేసుకోవాలని చెప్పారు. వాటిని పొలంలో వెదజల్లాలన్నారు. అంతేకాక పైపాటుగా రీమానును ఇంజనుతో చల్లించాలని తెలిపారు. వాటితోపాటు ఫర్తేరా ఐదుశాతం గుళికలను కూడా వాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్ సుభాని, వ్యవసాయ సహాయకులు మల్లిక, సాంబశివరావు, హకీమ్, రైతు సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు ప్రజలు వినియోగించుకోవాలి

ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



అర్జీల వివరాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

తెనాలిరూరల్: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. తెనాలి మండలం అంగలకుదురులో గురువారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నా రు. గ్రామస్తులు, రైతులు తమ తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 6 వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.